క్లుప్తంగా

నేడు పోలవరం ఎమ్మెల్యే బాలరాజు పర్యటన

కొయ్యలగూడెం : అచ్యుతాపురం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అదేవిధంగా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొనాలని ఆయన కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత శివశంకర్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ రాజు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన కర్రి శివశంకర్ ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ కేఎల్ఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సాయం



సహాయం అందజేస్తున్న దృశ్యం

టి.నరసాపురం : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పట్ల చిన్ననాటి స్నేహితులు ఔదార్యం చూపి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని వెలగపాడు గ్రామానికి చెందిన కుమ్మరి ఏసుబాబు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగించేవాడు. అంతేకాకుండా చిత్ర కళాకారుడుగా పని చేశాడు. అయితే ఇటీవల అనారోగ్యానికి గురై బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు 1991 నాటి బ్యాచ్ పూర్వ విద్యార్థులు (కామవరపుకోట) రూ.55 వేలు సమకూర్చి స్నేహితుని వైద్య సహాయం నిమిత్తం అతనికి అందజేశారు.

11న విగ్రహాల ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్) : ఈ నెల 11న ఉదయం 10 గంటలకు మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను స్థానిక జ్యూట్ మిల్లు సెంటర్‌లో ఆవిష్కరించనున్నట్లు బీసీ కులాల జేఏసీ ఒక ప్రకటనలో తెలియజేసింది. బీసీ సోదరులు, ఉద్యోగుల సహకారంతో ఏర్పాటు చేయనున్న ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పలువురు బీసీ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సోదరులు, బీసీ ఉద్యోగులు, మేధావులు, ఎస్సీ, ఎస్టీ సోదరులు ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది.

ఆర్థిక సాయం అందజేత

పెదపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003లో పదో తరగతి చదివిన తోటి విద్యార్థిని సురేఖకు స్నేహితులంతా కలిసి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. పెదపాడు శివారు రామచంద్రపురానికి చెందిన సురేఖ కుమార్తె ఇటీవల మరణించడంతో ఆమె ఆర్థికంగా ఇబ్బందులు పడుతోందని తెలుసుకుని ఆదివారం ఆమె నివాసానికి వెళ్లి తమ వంతు సాయం అందించారు.

భగవద్గీత శ్లోక పఠన పోటీలు



భగవద్గీత పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భగవద్గీత శ్లోక పఠన పోటీలకు విశేష స్పందన వచ్చింది. ఉద్దరాజు ఆనందరాజు పౌండేషన్ అధ్వర్యంలో భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభించారు. జిల్లా నలుమూలనుంచి చిన్నారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారులు భగవద్గీతను పఠిస్తున్నంత సేపు ఆహుతులు తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా యూకే విశ్వనాథరాజు మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలు అందరికీ రావాలని, ప్రతీ ఒక్కరూ భగవద్గీత చదవాలనే అనే ఉద్దేశ్యంతో వయస్సు తో సంబంధం లేకుండా 5 సంవత్సరాల నుండి 80 సంవత్సరాలు వరకు రున్న వారికి కూడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ భగవద్గీతను చదవడం వల్ల, ఆలపించడం వల్ల ముక్తిని పొందవచ్చన్నారు. అనంతరం పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ ప్రశంసాపత్రంతో పాటు భగవద్గీత పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దాయన సురేష్ చంద్రజీ, కంతేటి వెంకట్రాజు, ఎన్టీఓ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

జనం నినాదం.. జగనన్నే మా భవిష్యత్



ద్వారకాతిరుమలలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి



పాత చింతలపూడిలో సంక్షేమ లబ్ధి కరపత్రాన్ని అందిస్తున్న పార్టీ శ్రేణులు



జంగారెడ్డిగూడెం 13వ వార్డులో కరపత్రాన్ని అందిస్తున్న పీపీఎన్ చంద్రరావు

గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల : వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని.. భవిష్యత్‌లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి, మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రతి ఇంటా కోరుకుంటున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) ఎమ్మెల్యే తలారితో కలసి ఆదివారం సాయంత్రం మండలంలోని తిమ్మాపురంలో జగనన్నే మా భవిష్యత్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొంత ఖర్చుతో వాల్‌పోస్టర్లు వేయించిన సచివాలయ కన్వీనర్ ఆచంట బన్నుని అభినందించారు. అంతక ముందు వారు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం ద్వారకాతిరుమలలోని చెరువు వీధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను లబ్ధిదారులను అడిగి సమాధానాలు రాబట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రజలకు గుర్తు చేశారు. జగనన్న అందిస్తున్న పథకాలతో మీకు మేలు జరిగిందా.? ఇంకా ఏమైనా ప్రభుత్వం నుంచి రావాలని కోరుకుంటున్నారా.? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గృహసారథులు, కన్వీనర్లకు ఎమ్మెల్యే పలు సూచనలు, సలహాలనిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఎంపీటీసీలు పెద్దిరెడ్డి రమ్యకుసుమ, రుద్ర నాగ సూర్యకళ, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు చిన్ని, బొండాడ వెంకన్నబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివ, శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, దూలపల్లి ప్రసాద్, తేలు పెదబాబు, చిలుకూరి నాగ, కొల్లి సుబ్బారావు, సొసైటీ ఛైర్‌పర్సన్ గుర్రాల లక్ష్మణ్, దాకారపు అగ్గియ్య, వామిశెట్టి పరమేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్లు ఆచంట బన్ను, ముళ్లపూడి రాంబాబు, రహమాన్(షేక్ బషీరా), గంటా శేఖర్, పోలిన నారాయణరావు, నల్లంటి రామారావు, సర్పంచ్ ఎర్రగొల్ల రజని, మాధవ్, ధర్మారావు, రంగావలి, రాయుడు తదితరులున్నారు.

కొయ్యలగూడెం : జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆదివారం సరిపల్లి పంచాయతీ గ్రామాల పరిధిలో నిర్వహించారు. గ్రామ కన్వీనర్ మండపాటి రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షురాలు ఎం శ్రీదేవి, ఎంపీటీసీ బండి సీతారత్నం ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను కలుపుకుని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఇంటి డోర్లపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ప్రజల వద్ద నుంచి పార్టీ పటిష్టతకు వస్తున్న విజ్ఞప్తులను ఎమ్మెల్యే బాలరాజు దృష్టికి తీసుకువెళ్తామని నేతలు పేర్కొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని వేగవరంలో ఆదివారం జగనన్నే మానమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బాబ్జి, పార్టీ శ్రేణులతో కలిసి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగనన్నే మానమ్మకం స్టిక్కర్లను ఇళ్ల గోడలపై అతికించారు.ఈ సందర్భంగా పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ప్రతీ ఇంటా లబ్ధి చేకూరిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పథకాల లబ్ధితో ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని జెడ్పీటీసీ బాబ్జి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ-2 పోతన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు నులకాని వెంకట సూర్యచంద్రరావు, సచివాలయాల కన్వీనర్లు నులకాని వీరాస్వామి నాయుడు, చిట్యాల సూర్యచంద్రరావు, లెంక ముత్తిరాజు, కాకర్ల ధనలక్ష్మి, అక్కంపేట సర్పంచ్ పారేపల్లి నాగేంద్రకుమార్, పార్టీ నాయకులు రాఘవరాజు ఆదివిష్ణు, నెల్లూరి శివకల్యాణ్, మండపాటి సూర్యచంద్రరావు, గంటికూటి సత్యనారాయణ, ప్రగడ బాలు, దోరేపల్లి వెంకట స్వామి, విజనగిరి రమణ పాల్గొన్నారు.

మూడో రోజుకు జగనన్నే మా భవిష్యత్

జంగారెడ్డిగూడెం : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఆదివారంతో మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని 13వ వార్డులో విద్యా వికాస్ ఏరియాలో ఆ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు ఇంటింటికి వెళ్లి ప్రజల్ని నేరుగా కలిసి ప్రభుత్వ పథకాలు సరిగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆ వార్డు ప్రజల అనుమతితో జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్‌ను ఇంటి తలుపులకు అంటించారు. గత నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరిపాలన ఎలా ఉందో ప్రజలను అడగగా వారు సంతోషం వ్యక్తం చేసినట్లు చంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గూడపాటి రాధాకృష్ణ, చింతా రాంబాబు, రాజు బోయిన శ్రీను, బిక్కు మహాత్మా, ఆశీర్వాదం, నాగబాబు, గృహ సారథులు సాయి, మనీషా, శ్రావణి, ఉషారాణి, శ్యామల, రెహ్మాన్, కీర్తి, జగన్నాథరావు, నాగేంద్ర వరప్రసాద్, రవి, మానికల సత్యనారాయణ, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు. పట్టణంలోని 3వ వార్డులో కౌన్సిలర్ మేకా రమాదేవి, కన్వీనర్ పెసరగంటి త్రిమూర్తులు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పన్నాస పరశురామ మాస్టర్, తల్లాడ జ్యోతి, పోలిశెట్టి సుబ్బలక్ష్మి, రామిశెట్టి కిషోర్, తల్లాడ హరి, మేక సుబ్రహ్మణ్యం, గృహసారథులు వలంటీర్లు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలన సాగిస్తున్నారని 24వ వార్డు కౌన్సిలర్ దొంతు మాధవ్ అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటి వద్ద నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్లు అంటించారు. పథకాల పనితీరు, ఇతర అంశాలపై నేరుగా స్టిక్కర్లపై ఉన్న నెంబర్ కు కాల్ చేయవచ్చని అన్నారు. 9వ సచివాలయం కన్వీనర్ సుంకర నాగదేవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్

చింతలపూడి : మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మండలంలో ఉత్సాహంగా సాగుతోంది. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి గత టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. సంక్షేమ పథకాలను వివరించడానికి, ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం దోహద పడుతుందని ఏఎంసీ డైరెక్టర్ ఎం ఇమ్మానియేలు అన్నారు. పాత చింతలపూడిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంతవరకు వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారుల వివరాలు సేకరించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. కార్యక్రమంలో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో..

చింతలపూడి నగర పంచాయతీ కొప్పులవారి వీధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మూడో రోజూ కొనసాగింది. నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, దారా పేర్రాజు, గోల్కొండ సురేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వ పనితీరును వివరించారు. కార్యక్రమంలో గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగ



పంగిడిగూడెం ఆర్‌సీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఆదివారం మండలంలో వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ఈస్టర్ సందర్భంగా మండలంలోని క్రైస్తవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక బోయగూడెం ఆర్‌సీఎం చర్చిలో యేసు పునరుత్థాన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంధకారంలో జీవించే మానవ జీవితాలలో వెలుగును ప్రసాదించి మానవాళికి ఒక ప్రత్యేక మార్గాన్ని ప్రబోధించి, పాపుల రక్షణకోసం శిలువ వేయబడి తిరిగి లేచిన క్రీస్తు ఔన్నత్యాన్ని రోమన్ కేథలిక్ మిషన్ ఫాదర్ కామా మాధ్యూ బోధించారు. కార్యక్రమంలో ఉపదేశికులు, వివిధ గ్రామాల నుంచి విశ్వాసులు, క్రైస్తవ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని పలు గిరిజన గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా లూథరన్ దేవాలయం ప్యారిస్ పాస్టర్ ఆమెన మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువ మరణాన్ని పొంది మానవాళి పాపాల్ని క్షమించడానికి మళ్లీ అవతరించారని చెప్పారు. ప్రేమ, సహనం, శాంతిని పంచిన కరుణామయుడు ఏసుక్రీస్తు అని, ఆయన ప్రేమ స్వరూపుడని తెలిపారు. అలాగే పలు చర్చిల్లో ఈస్టర్‌కు హాజరైన యువకులు సంగీత పరిచర్య పాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. బుట్టాయగూడెం, దొరమామిడి, ముప్పినవారిగూడెం, రెడ్డిగణపవరం, రామారావుపేట సెంటర్, పందిరిమామిడిగూడెం, అంతర్వేదిగూడెం గ్రామాల్లో ఈ ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

క్రీస్తు బాటలో నడవాలి

జంగారెడ్డిగూడెం రూరల్ : ప్రపంచానికి శాంతి, దయ, ప్రేమ చూపిన ఏసుక్రీస్తు బాటలో నడుచుకోవాలని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని పంగిడిగూడెం ఆర్‌సీఎం చర్చిలో నిర్వహించిన ఈస్టర్ పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే ఎలీజా దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా కేక్ కట్ చేసి ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈస్టర్ పండుగ విశిష్టతను పాస్టర్లు వివరించారు. ఏసుక్రీస్తు గీతాలతో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, సర్పంచ్‌లు కోట వెంకటేశ్వరరావు, పారేపల్లి నాగేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు గంజి వినోద్, ఆర్‌సీఎం సంఘం పెద్దలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ఈస్టర్ పర్వదినాన్ని క్రీస్తు విశ్వాసులు ఆదివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. తెల్లవారుజామునే తమ పూర్వీకుల సమాధుల వద్ద నివాళులర్పించారు. పూలతో సమాధులను అలంకరించి కొవ్వొత్తులను వెలిగించి పెద్దల ఆత్మ శాంతికై మౌనం పాటించారు. బైబిల్‌లోని సూక్తులను పాస్టర్లు చదివి వినిపించి శ్రద్ధాంజలి ఘటించారు. కొయ్యలగూడెం మిషనరీ హాస్పిటల్ బరియల్ గ్రౌండ్, పొంగుటూరు గ్రామాలలోని శ్మశానవాటికలలో ఈస్టర్ కార్యక్రమాలను నిర్వహించారు.

టి. నరసాపురం : మండలంలోని ప్రకాషనగర్, బొర్రంపాలెం, టి.నరసాపురం, పుట్రేపు, మర్రిగూడెం, గండిగూడెం, మక్కినవారిగూడెం తదితర గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కొందరు చనిపోయిన కుటుంబీకులకు చెందిన సమాధులను అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రకాషనగర్‌లో క్రీస్తు పునరుద్ధారణ సువార్త దండయాత్ర నిర్వహించారు. ప్రార్థన ఆలయాల్లో పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలలో పాస్టర్లు జి.జ్ఞాన రాజు, కె.నిరీక్షణరావు, సీహెచ్ హోషేయ, సీహెచ్ రమేష్, అకుల ప్రసన్నకుమార్, డానియల్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



బోయగూడెం సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న ఫాదర్ కామా మాధ్యూ



పొంగుటూరు గ్రామంలో పెద్దల సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వారసీకులు



ప్రకాష్ నగర్‌లో సువార్త దండయాత్ర చేస్తున్న దృశ్యం

మల్లోలు రహదారిని బాగు చేయండి



మల్లోలు రహదారి పరిస్థితి చూపుతున్న రైతులు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని మల్లోలు రహదారిని అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. కొయ్యలగూడెం వ్యాప్తంగా 60 శాతానికి పైగా ఉన్న రైతులకు మల్లోలు రహదారి ప్రధానమని ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు జలమయమైందన్నారు. దీనివల్ల పండిన పంటను సకాలంలో తీసుకువెళ్లలేకపోతున్నామని, పొలాల్లోనే పంటను ఉంచడం వల్ల నష్టపోతున్నామని రైతులు వాపోయారు. మల్లోలు రహదారి వందలఏళ్ల క్రితం నుంచి ఉన్నదని ఈ రహదారికి ఇరువైపులా నివాసిత ప్రాంతాల ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇదే ప్రాంతంలో ఇటీవల జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం చేపట్టారని రోడ్డు అధ్వానంగా ఉండడం వల్ల మెటీరియల్‌ని ఇళ్ల నిర్మాణదారులు తీసుకువెళ్లలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మల్లోలు రహదారిని అభివృద్ధి చేయాలని, కనీసం గ్రావెల్ రోడ్డు నిర్మాణమైనా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఎర్రకాలువ వంతెనపై గోతుల పూడ్చివేత



ఎర్రకాలువ వంతెనపై గోతులు పూడ్చిన సోషల్ వర్కర్స్ టీం సభ్యులు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఎర్రకాలువ వాగు వంతెనపై గోతులను పూడ్చారు. కామవరపుకోట సోషల్ వర్కర్స్ టీం ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. సోషల్ వర్కర్ వీరమల్లు మధు ఆధ్వర్యంలో టీం సభ్యులు పండూరి రామసాయి, వీరమల్ల సాజన్ సాయి గ్రావెల్ మెటల్‌ను సిమెంట్‌తో కలిపి గోతులను పూడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంతెనపై గోతులు ఏర్పడి ఇనుప ఊచలు పైకి లేచిపోవడంతో వాహనాల రాకపోకల సమయంలో టైర్లు పంక్చర్లు పడుతూ, ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఆలోచనతో గోతులను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలి

ఏలూరు (టూటౌన్) : రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. స్థానిక అన్నే భవన్ వద్ద సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రబీ కోతలు ప్రారంభమై కళ్లాల్లోకి ధాన్యం వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. గత ఖరీఫ్ సమస్యలు పునరావృత్తం కాకుండా రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో ధాన్యం కొనుగోలుపై ముందస్తుగా చర్చించి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పండించిన పంటలు 60 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామనే నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో సరాసరి దిగుబడి 37 బస్తాలు కాగా ఏలూరు జిల్లా పరిధిలో 50 బస్తాలకు పైబడి దిగుబడి వస్తోందన్నారు. దీనికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను తెరచి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరరావు పాల్గొన్నారు.

అల్లా బోధనలు అందరూ పాటించాలి



ముస్లిం మహిళలను అభినందిస్తున్న నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : అల్లా బోధనలు అందరూ పాటిస్తూ రంజాన్ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఏలూరు పట్టణ ముస్లిం మైనార్టీ మహిళల ఆధ్వర్యంలో ఆదివారం తంగెళ్ళమూడి దర్సెగాహ్-ఈ-ఇస్లామిక్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణలో జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో నూర్జహాన్ పెదబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం మైనార్టీ మహిళల ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా ఏటా రంజాన్ పండుగ నెల రోజులు దీక్షలు చేస్తూ అల్లా అనుగ్రహం పొందడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. అల్లా బోధనల ప్రకారం ప్రతి ఒక్కరూ తోటివారికి సహాయ పడాలని, క్రమశిక్షణతో నడుచుకోవాలని ఆమె సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను అందరూ ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని కోరారు. రంజాన్ పండుగ నెల రోజులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని, నగర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. కార్యక్రమంలో 48, 40, 16వ డివిజన్ల కార్పొరేటర్లు సున్నం స్వాతి కిషోర్, తుమరాడ స్రవంతి, జుజ్జవరపు విజయనిర్మల, కార్యక్రమం నిర్వాహకులు అన్సారి తదితరులు పాల్గొని ఇఫ్తార్ స్వీకరించారు.

రక్తకణాల పెరుగుదలపై అవగాహన తప్పనిసరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : మానవ శరీర నిర్మాణంలో అత్యంత ప్రత్యేకమైనది రక్తమేనని, రక్తం ప్రాముఖ్యత, దాని ఆవశ్యకతలపై ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పాండిచ్చేరికి చెందిన హీమోఫీలియా సొసైటీ పాండిచ్చేరి చాప్టర్ అధ్యక్షురాలు పద్మశ్రీ నళినీ పార్థసారథి పిలుపునిచ్చారు. ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా హిమోఫిలియా సొసైటీ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మానవుని శరీరంలో రక్తం ప్రాముఖ్యత, రక్తకణాల పెరుగుదల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నళినీ పార్థసారథి మాట్లాడుతూ గత ముప్పై సంవత్సరాలుగా హిమోఫిలియా సొసైటీని ప్రారంభించి దేశవ్యాప్తంగా హిమోఫిలియా బాధితులకు వైద్య సేవలు, శస్త్రచికిత్సలు అందిస్తున్నామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తనకు అందించిన పద్మశ్రీ అవార్డ్ హిమోఫిలియా సొసైటీకి, దానిలో పనిచేసిన అందరికీ చెందుతుందన్నారు. అనంతరం డాక్టర్ నళిని పార్థ సారథిని ఘనంగా సత్కరించారు. ఈ సభకు హిమోఫీలియా విజయవాడ చాప్టర్ కార్యదర్శి ఎంబీఎస్వీ ప్రసాద్ అధ్యక్షత వహించగా దంత వైద్యనిపుణులు వంశీ కృష్ణ, సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రామరాజు, పీజీ కోర్సుల డైరెక్టర్ కేవీఆర్ఎస్ఎస్ కొండయ్యరావు, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పీ.శైలజ, 700 మంది హిమోఫీలియా బాధితులు, వారి తల్లిదండ్రులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.